వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు అందిన సమాచారం మేరకు వసతి గదుల సమాచారం ఇలా.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	02	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	20	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	02	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	01	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	04	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	20	560
నందీశ్వర సూట్స్	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	18	448
పార్వతీపురం స్పెషల్	16	672
పార్వతీపురం సాధారణ	15	336

\- వేములవాడ

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి





రుద్రంగిలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పద్మశాలీ నాయకులు, ఎల్లారెడ్డిపేటలో..

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని న్యూఅర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం భవనంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చిలుక దేవరాజం, చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు సత్తయ్య, వసంతరావు, సత్యం, లక్ష్మణ్, శంకర్ తదితరులున్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మార్కండేయ భవన్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు గూడూరి భరత్, పట్టణ అధ్యక్షుడు తడుక బాలకిషన్, నాయకులున్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం భవనంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పద్మశాలీ నాయకులు నివాళి అర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ స్వామి ఆలయ ఆవరణలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశాలీలు నివాళి అర్పించారు. నాయకులు రాపెల్లి ఆనందం, మచ్చ శ్రీనివాస్, అంకారపు రవీందర్, మచ్చ ఆంజనేయులు, గోనె ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఎల్లారెడ్డిపేటలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏలూరి రాజయ్య, నాయకులు బండారు బాల్‌రెడ్డి, చెన్ని బాబు, మెండె శ్రీనివాస్, కోనేటి శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్, మహబూబ్, రమేశ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. సంఘం అధ్యక్షులు రాపల్లి దేవాంతం, ప్రధాన కార్యదర్శి వనం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఏఎంసీ చైర్‌పర్సన్



గంభీరావుపేట: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎల్లారెడ్డిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ షేక్ సబేర బేగం శనివారం గాంధీభవన్‌లో కలిశారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపి, బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు సేవలందిస్తానని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, మహ్మద్ షకీల్ ఉన్నారు.

ఎస్జీఎఫ్ పోటీల్లో కనగర్తి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం, టీచర్లు

కోనరావుపేట: కోనరావుపేట మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడాపోటీల్లో కనగర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎం. హర్షిత(ఖోఖో), ఎం. శ్రీతేజ(వాలీబాల్), జి. శిరీష, ఓ. స్రవంతి(వాలీబాల్, కబడ్డీ), బి. వర్ష (ఖోఖో, వాలీబాల్, 400 మీటర్ల రన్నింగ్), నక్షత్ర, పల్లవి, రవళిక వాలీబాల్‌లో అండర్–17 విభాగంలో జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అండర్–14 బాలుర విభాగంలో అశ్విత్, రంజిత్, రంజిత్ (ఖోఖో), అండర్–14 బాలికల విభాగంలో హారిక, రజన (ఖోఖో) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

క్లుప్తంగా

వినియోగంలోకి జీపీ ట్రాక్టర్



చెత్త పోస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: మండలకేంద్రంలో 10రోజులుగా మూలకు పడి ఉన్న పంచాయతీ ట్రాక్టర్ వినియోగంలోకి వచ్చింది. ట్రాక్టర్ డీజిల్‌కు డబ్బుల్లేక 10రోజులుగా ట్రాక్టర్ అలాగే ఉంది. 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు పెట్రోల్ పంపులో బకాయి ఉన్న రూ.1.10 లక్షల బిల్లు పంచాయతీ నుంచి చెల్లించారు. దీంతో ట్రాక్టర్ వినియోగంలోకి వచ్చింది. త్వరలోనే గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

పిల్లల హాజరు శాతం పెంచాలి

సిరిసిల్ల: సిరిసిల్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. పోషణమాసంలో భాగంగా శనివారం విద్యానగర్, అంబేద్కర్‌నగర్–2, బోయవాడ, పోచమ్మవీధి, సిద్దులవాడ, పత్తిపాకవీధి, కంచరవీధి, రాళ్లబావి, పోస్ట్ ఆఫీస్ వీధి, చాకలివీధి, శాంతినగర్–1, 2, 3, తంగళ్లపల్లిలోని–5 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పిల్లల సంఖ్య తక్కువగా ఉందని, హాజరుశాతం పెరిగేలా చూడాలని ఆదేశించారు.

వెంకన్నకు పురస్కారం



వెంకన్న

సిరిసిల్లటౌన్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ శాలివాహన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్తమ గురువులకు పురస్కారాలు ప్రకటించారు. సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచర్ల వెంకన్న ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు.

అడ్వెంచర్ క్యాంప్ సెలక్షన్స్‌కు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

వేములవాడరూరల్: వేములవాడ పరిధిలోని శాత్రాజుపల్లి రోడ్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అడ్వెంచర్ క్యాంప్ సెలక్షన్స్‌కు ఎంపి కైనట్లు ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస రామలింగేశ్వర శర్మ తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగే సెలక్షన్స్‌కు ద్వితీయ సంవత్సరానికి చెందిన ఎస్.సుప్రియ (బిడిటి), డి.వర్షిత (ఎంబీజడ్సీ) విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు హిమాచల్‌ప్రదేశ్‌లో 10రోజుల క్యాంపులో పాల్గొంటారన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

కోనరావుపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై నిర్వహిస్తున్న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి జవ్వాజి విమల కోరారు. కోనరావుపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలపై ఈనెల 23న నిర్వహించే చలో హైదరాబాద్ తరలిరావాలని కోరారు. నాయకులు బడుగు రాములు, గౌరు లచ్చయ్య, సుతారి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలిపెల్లి బీసీ హాస్టల్ సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ అధికారి రాజమనోహర్‌రావు

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి బీసీ హాస్టల్‌ను జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి రాజమనోహర్‌రావు శనివారం సందర్శించారు. విద్యార్థి రోహిత్‌ను పాము కాటు వేయడంతో హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై, మాట్లాడారు. రాత్రివేళలో జాగ్రత్తగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గాలిపెల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పావని, ఎంఈవో బన్నాజీ, వ్యాయామ ఉపాధ్యాయుడు సానబాబు హాస్టల్‌కు వచ్చి, వివరాలు సేకరించారు. బీజేపీ మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, నాయకులు, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్, నాయకులు, ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు ఎ.నాగరాజు, నాయకులు హాస్టల్‌ను సందర్శించారు. ఇక్కడ మౌలిక వసతులు లేకపోవడం వల్లే విద్యార్థి పాముకాటుకు గురయ్యాడని ఆరోపించారు.

ఏఐఎస్‌ఎఫ్ నాయకుల పరామర్శ

గంభీరావుపేట: గాలిపెల్లి బీసీ వసతిగృహంలో పాముకాటుకు గురైన రోహిత్‌ను, వీర్నపల్లి కేజీబీవీ హాస్టల్ బిల్డింగ్ పైనుంచి దూకి గాయపడ్డ విద్యార్థిని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శనివారం ఎల్లారెడ్డిపేటలోని ఆస్పత్రిలో పరామర్శించారు. సంఘటనలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న సంఘటనలపై విద్యాశాఖ, కలెక్టర్‌లు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. కేటీఆర్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్, నాయకులు ఈశ్వర్, అక్షయ్, మనోహర్ ఉన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ నాయకులు..

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థిని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సాయి శనివారం పరామర్శించారు. వీర్నపల్లి విద్యాలయంలో కిందపడి గాయాలకు గురైన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని కోరాడు. నాయకులు, భాను, సాయి, నవీన్ తదితరులున్నారు.

సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి

- నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



మాట్లాడుతున్న చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): రైతులు, సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి చెందుతోందని నాఫ్‌స్కాబ్ చైర్మన్, గంభీరావుపేట సింగిల్‌విండో చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేట సింగిల్‌విండో మహాజన సభ శనివారం రవీందర్‌రావు అధ్యక్షతన జరిగింది. రవీందర్‌రావు మాట్లాడుతూ నష్టాల్లో నుంచి రైతులకు అన్ని రకాల రుణాలిచ్చే స్థాయికి సంఘం బలోపేతమైందన్నారు. సంఘం ప్రగతి నివేదికను సభ్యులకు, రైతులకు చదివి వినిపించారు. ఐదు నెలల్లో దాదాపు రూ.25కోట్ల వ్యవసాయ రుణాలు అందించినట్లు తెలిపారు. అప్పులు ఇచ్చి పుచ్చుకోవడమే కాకుండా ఎరువులు, విత్తనాలు, పెట్రోల్, డీజిల్ వ్యాపారాలతో ఆర్థికంగా పుంజుకోవడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.15కోట్ల ఎరువుల వ్యాపారం, రూ.25లక్షల విత్తనాల వ్యాపారం, రూ.22కోట్ల వడ్లు కొనుగోలు వ్యాపారం, డీజిల్, పెట్రోల్ ద్వారా రూ.96లక్షల వ్యాపారం చేసినట్లు వివరించారు. వైస్‌చైర్మన్ రామానుజాగౌడ్, సీఈవో రాజిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

గంభీరావుపేటలోని దోసలగూడెంకు చెందిన బరిగెల బాలకిషన్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని కుటుంబాన్ని నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పరామర్శించారు. పల్లె బాలయ్య తండ్రి రాములు మూడు రోజుల క్రితం మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. సెస్ డైరెక్టర్ నారాయణరావు, నాయకులు వెంకటస్వామిగౌడ్, దయాకర్‌రావు, కూర సురేష్, ధన్‌రాజ్, అభిలాష్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణ్ బాపూజీ, ఐలమ్మ జయంతికి రండి

సిరిసిల్ల అర్బన్: ఈ నెల 26న నిర్వహించనున్న చిట్యాల ఐలమ్మ, 27న నిర్వహించనున్న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలకు ప్రజలు హాజరు కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ విగ్రహం నుంచి ఐలమ్మ విగ్రహం వరకు ఊరేగింపు అనంతరం లహరి ఫంక్షన్‌హాల్లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు.

వికాస్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే ఆకట్టుకుంది. సిరిసిల్లలోని ఓ కల్యాణ మంటపంలో శనివారం నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై, మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి పురిటిగడ్డకు పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల కరెస్పాండెంట్ గుగ్గిళ్ల జగన్‌గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'గ్రామ సరిహద్దులు మార్చొద్దు'



ఇల్లంతకుంట: వెంకట్రావుపల్లి సరిహద్దులు మార్చొద్దని గ్రామస్తులు కోరారు. శనివారం తహసీల్దార్ ఫారుఖ్‌కు వినతి పత్రం అందించారు. 2018లో గొల్లపల్లి నుంచి వెంకట్రావుపల్లి నూతన పంచాయతీగా ఏర్పడిందన్నారు. అప్పటి రెవెన్యూ సరిహద్దులే కొనసాగించాలని విన్నవించారు. మాజీ సర్పంచులు యాదగిరి గౌడ్, లింగం తదితరులున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శోభ, నాయకులు

బోయినపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ అన్నారు. విలాసాగర్‌లో శనివారం బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, నాయకులు గుగ్గిళ్ల జయశ్రీ, పెరుక శ్రవణ్, ఉదారి నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో భాగస్వాములవ్వండి

వేములవాడరూరల్: బీజేపీలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని వేములవాడరూరల్ బీజేపీ అధ్యక్షుడు జక్కుల తిరుపతి కోరారు. వేములవాడరూరల్ మండలం జయవరం, హన్మాజీపేట, లింగంపల్లి, మల్లారం, బొల్లారం గ్రామాల్లో శనివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మనోజ్‌కుమార్

వీర్నపల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్ కుమార్ కోరారు. శనివారం వీర్నపల్లి మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందజేశారు. కేజీబీవీకి వెళ్లే దారిలో వంతెన లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టళ్ల చుట్టూ గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయన్నారు. పూర్తి స్థాయిలో టీచర్లను నియమించాలని, విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చదువుతోపాటు ఆటల్లో రాణించాలి

- సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ
- ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



మాట్లాడుతున్న సీఐ కృష్ణ

సిరిసిల్లటౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి 10వ సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ముగిశారు. ముగింపు వేడుకలకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల నుంచి హాజరై, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. డీవైఎస్‌వో రాందాసు, టోర్నమెంట్ సెలక్షన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శోభన్‌బాబు, అభిషేక్, జిల్లా అధ్యక్షుడు పెంట అంజయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, టోర్నమెంట్ నిర్వాహక ప్రతినిధులు నవీన్ కుమార్, వేణుగోపాల్, నాగిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఏఈవోల వినతి

వేములవాడరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగంకు ఏఈవోలు శనివారం వినతిపత్రం అందజేశారు. పరిష్కరించకుంటే ఈ నెల 27 నుంచి ఆందోళన చేపడతామన్నారు. ప్రతీ వెయ్యి ఎకరాలకు గ్రామ వ్యవసాయ సహాయకుడిని నియమించాలని, డిజిటల్ క్రాప్ సర్వేకు ట్యాబ్ లేదా ఫోన్, ఇతర అలవెన్సులు సమకూర్చాలని కోరారు. జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, సెక్రెటరీ హేమాజీ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

❖ **సీజనల్ వ్యాధులపై కళా ప్రదర్శన**

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లలోని కార్మికవాడల్లో శనివారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సీజనల్ వ్యాధులపై కళాప్రదర్శన నిర్వహించారు. సాంస్కృతిక సారథి బృందం లీడర్ ఎడ్మల శ్రీధర్‌రెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

❖ **మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు..**

వేములవాడఅర్బన్: తిరుపతి లడ్డూ వ్యవహారంపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు వేములవాడ పట్టణానికి చెందిన విశ్వహిందూ పరిషత్ నాయకుడు గడప కిశోర్‌రావు శనివారం తెలిపారు. నెయ్యిని సరఫరా చేసిన కాంట్రాక్ట్ సంస్థపై, అప్పటి పాలకమండలి, చైర్మన్‌పై విచారణ జరపాలని కోరినట్లు పేర్కొన్నారు.

❖ **ఏఎంసీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు**

సిరిసిల్ల: సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియామకమైన వెల్ముల స్వరూపకు శనివారం పలువురు స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు.

❖ **ఏఎంసీ వైస్ చైర్మన్‌కు..**

తంగళ్లపల్లి: సిరిసిల్ల ఏఎంసీ వైస్ చైర్మన్, తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నేరెళ్ల నర్సింగంగౌడ్‌కు శనివారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పెద్దూరి తిరుపతి, మోర లక్ష్మీరాజం, రెడ్డి పర్శరాములు పాల్గొన్నారు.

❖ **గీత కార్మిక సంఘం అధ్యక్షుడిగా బైరి శ్రీనివాస్‌గౌడ్**

ముస్తాబాద్: ఆవునూర్ గీత కార్మిక సంఘం అధ్యక్షుడిగా బైరి శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చంద్రయ్యగౌడ్, బూరిజికింది రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పందిర్ల దేవయ్యగౌడ్, కోశాధికారిగా ప్రశాంత్ ఎన్నికయ్యారు.

❖ **పది మండలాల్లో మోస్తరు వర్షాలు**

సిరిసిల్ల: జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ఓ మోస్తరు వర్షాలు పడ్డా యి. అత్యధికంగా ఎల్లారెడ్డిపేటలో 44.5 మిల్లీ మీ టర్ల వర్షం పడగా.. రుద్రంగిలో 2.0, సిరిసిల్లలో 2.9, వేములవాడలో 0.4, కోనరావుపేటలో 8.7, వీర్నపల్లిలో 30.2, గంభీరావుపేటలో 16.9, ముస్తాబాద్‌లో 22.7, తంగళ్లపల్లిలో 0.3, ఇల్లంతకుంటలో 3.6 మి.మీ. వర్షం కురిసింది.

❖ **డిగ్రీ కళాశాలలో 'స్వచ్ఛతా హీ సేవ'**

గంభీరావుపేట : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. కళాశాల ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

❖ **తంగళ్లపల్లిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక**

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి రూ.5.90 కోట్ల ఉపాధి హామీ పనులను చేయగా క్షేత్రస్థాయిలో పర్యటించిన సామాజిక తనిఖీ సిబ్బంది నివేదికలను అధికారుల ఎదుట వినిపించారు. డీఆర్డీవో శేషాద్రి, డీవీవో రామారావు, ఎంపీవో మీర్జా తదితరులు పాల్గొన్నారు.

❖ **దరఖాస్తుల ఆహ్వానం**

వీర్నపల్లి: వీర్నపల్లి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. పీజీటీ ఇంగ్లిష్–2, పీజీటీ ఫిజిక్స్–1, పీజీటీ కెమిస్ట్రీ–1, పీజీటీ మ్యాథ్స్–1, టీజీటీ మ్యాథ్స్–1, టీజీటీ సైన్స్–1లలో అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

❖ **30న రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు**

సిరిసిల్లకల్చరల్: సత్యసాయి సేవా సంస్థలు, రాష్ట్ర కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ సహకారంతో రాష్ట్ర స్థాయిలో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థల ప్రతినిధి బూర రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహించే పోటీలకు ప్రధాన అంశంగా..'ధనం వస్తుంది, పోతుంది, గుణం వస్తుంది పెరుగుతుంది' అనే అంశాన్ని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈనెల 30న ఉదయం 11 నుంచి 11.45 గంటల వరకు పోటీలు జరుగుతాయని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. గూగుల్ ఫాంలో వివరాలను పొందుపరచాలని, పూర్తి వివరాలకు 9441006447, 9177663059 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

❖ **అధ్యాపకులను సస్పెండ్ చేయాలి**

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకులను సస్పెండ్ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్ కుమార్, జిల్లా కన్వీనర్ లోపల్లి రాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

❖ **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

సిరిసిల్ల అర్బన్: పెద్దూరు సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ లైన్ మెయింటెనెన్స్ పనుల కారణంగా ఆదివారం పెద్దూరు, జగ్గారావుపల్లి, సర్దాపూర్, ఇప్పలపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

❖ **ఉచితంగా నేత్ర వైద్యసేవలు**

వేములవాడరూరల్: హైదరాబాద్‌కు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నూకలమర్రిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వేములవాడ విజన్ టెక్నీషియన్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

❖ **పోషకాహారంతో రక్తహీనత నివారణ**

కోనరావుపేట: గర్భిణులు పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కనకమ్మ, గంగాలక్ష్మి అన్నారు. కొలనూర్, కోనరావుపేటలో అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన పోషణ్ అభియాన్‌కు హాజరయ్యారు.

❖ **అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి**

ముస్తాబాద్: ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను దూషిస్తున్న అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ డిమాండ్ చేశారు. కళాశాలలో శనివారం విలేకరులతో మాట్లాడారు. డీఐఈవో, అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

❖ **రసాభాసగా కోనరావుపేట గ్రామసభ**

కోనరావుపేట: మండల కేంద్రంలో ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. 10 రోజులుగా పారిశుద్ధ్య పనులు సక్రమంగా ఎందుకు నిర్వహించడం లేదని గ్రామస్తులు ప్రశ్నించారు. గ్రామపంచాయతీలో రూ.3 లక్షలు నిల్వ ఉండంగా పెట్రోల్ బంకులో డీజిల్ డబ్బులు చెల్లించడంలో ఎందుకు ఆలస్యం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీవో మధ్యలోనే వెళ్లిపోయారు.

❖ **హిందీ భాషా దినోత్సవం**

చందుర్తి: నర్సింగపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో హిందీ పుస్తకాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్, క్విజ్ పోటీలు జరిపారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. హెచ్‌ఎం జితేందర్, టీచర్లున్నారు.

❖ **మట్టిలో దిగబడిన బస్సు**

వీర్నపల్లి: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు సాగుతుండగా శుక్రవారం కురిసిన వర్షానికి బస్సు శనివారం మట్టిలో కూరుకుపోయింది. అక్కడే రోడ్డు పనులు చేస్తున్న జేసీబీ సహాయంతో స్థానికులు బస్సును బయటకు తీశారు.

❖ **సిరిసిల్ల మండల స్థాయి క్రీడలు**

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మినీ స్టేడియంలో సిరిసిల్ల మండల స్థాయి క్రీడా పోటీలను శనివారం నిర్వహించారు. బాలబాలికలకు వేర్వేరుగా 200, 400, 800 మీటర్ల విభాగాల్లో పరుగు, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో తదితర పోటీలు జరిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎస్జీఎఫ్ జిల్లా బాధ్యులు, పీఈటీలు ప్రభాకర్, మదన్ తదితరులు అభినందించారు.

❖ **పీఆర్సీ అమలు చేయాలి**

కోనరావుపేట: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జంగిటి రాజు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

❖ **అంగన్‌వాడీ కేంద్రంలో 'ఆరోగ్యలక్ష్మి'**

ఇల్లంతకుంట: రామాజీపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం నిర్వహించారు. పెద్ద లింగాపురం సెక్టార్ సూపర్‌వైజర్ సూర్యకళ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.